సాక్షి
పల్నాడు
శనివారం । 15 । ఏప్రిల్ । 2023



జగనన్న కానుకల పరిశీలన

రొంపిచర్ల: మండల కేంద్రంలో భద్రపర్చిన జగనన్న విద్యా కానుకల స్టాక్ పాయింట్‌ను శుక్రవారం రాష్ట్ర పరిశీలకులు, జాయింట్ డైరెక్టర్ మేరీచంద్రిక పరిశీలించారు.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: మార్కెట్‌యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.3,500, గరిష్ట ధర రూ.5,800, మోడల్ ధర రూ.4,700 వరకు పలికింది.

మరో ఐదు కేసులు



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఐదు కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. గుంటూరు ఏటీ అగ్రహారం, సంపత్‌నగర్‌లో ఒక్కొక్కటీ చొప్పున, ఇన్నర్‌రింగ్ రోడ్డులో మూడు కేసులొచ్చాయి. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (శని)	సహర్ (ఆది)
నరసరావుపేట	6:30	4:32
గుంటూరు	6:28	4:35
బాపట్ల	6:28	4:35

న్యూస్‌రీల్

బాధ్యతలు స్వీకరించిన బాపట్ల జిల్లా కలెక్టర్




బాపట్ల: జిల్లా నూతన కలెక్టర్‌గా పి.రంజిత్ బాషా పదవీ బాధ్యతలు చేపట్టారు. శుక్రవారం సాయంత్రం మూడుగంటలకు కలెక్టర్ చాంబర్‌లో జిల్లా కలెక్టర్ బాధ్యతలు చేపట్టారు. కృష్ణా జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తూ బదిలీపై బాపట్ల జిల్లా కలెక్టర్‌గా వచ్చారు. నూతనంగా బదిలీపై వచ్చిన పి.రంజిత్ బాషాను జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మీ శివ జ్యోతి, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ అర్జున్, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ శంకర్ నాయక్, వ్యవసాయ శాఖ జె.డి అబ్దుల్ సత్తార్, పశుసంవర్ధక శాఖ జె.డి హనుమంత రావు, మత్స్య శాఖ జె.డి సురేష్, జిల్లా పంచాయతీ అధికారి రమేష్, రెవెన్యూ డివిజనల్ అధికారులు రవీంద్ర, సరోజిని, పార్థసారథి, తహసీల్దార్లు కలిసి పూలమాలలతో అభినందించారు.

జీవితంలో ఎదిగేందుకు అవకాశాలను శోధించాలి



గుంటూరు లీగల్: జీవితంలో ఉన్నతంగా ఎదిగేందుకు గల అవకాశాల్ని ప్రతి ఒక్కరూ శోధించాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.మన్మథరావు సూచించారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ జయంతి వేడుకలు శుక్రవారం గుంటూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి జీబీఏ అధ్యక్షుడు కె.వి.కె.సురేష్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జస్టిస్ కె.మన్మథరావు మాట్లాడుతూ సత్వర న్యాయం అందించేందుకు న్యాయమూర్తులు ఎప్పుడూ సంసిద్ధులై ఉంటారని, తదనుగుణంగా న్యాయవాదులు కూడా సహకరించాలని కోరారు. సకాలంలో అందని న్యాయం అన్యాయమే అవుతుందని తెలిపారు. కందుకూరులో ఒక గ్రామీణ ప్రాంత కోర్టు నుంచి హైకోర్టు వరకు జరిగిన తన వ్యక్తిగత ప్రస్తానాన్ని వివరించారు. అంబేడ్కర్ తన జీవితంలో జరిగిన ఎన్నో అవమానాల్ని సవాలుగా స్వీకరించి అసమానతలను అధిగమించారని తెలిపారు. కార్యక్రమాన్ని బార్ కోశాధికారి జి.విజయరాజ్ కుమార్ నిర్వహించారు. జిల్లా ఇంచార్జి ప్రధాన న్యాయమూర్తి వి.ఎ.ఎల్.సత్యవతి, నాలుగో అదనపు జిల్లా జడ్జి జి.రామగోపాల్, జూనియర్ సివిల్ జడ్జిలు, జీబీఏ మాజీ అధ్యక్షులు జి.శాంత కుమార్, నట్టువ సత్యనారాయణ, జీబీఏ ప్రధాన కార్యదర్శి ఆర్.ఎన్.వంశీకృష్ణ, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పశ్చిమకు 416 క్యూసెక్కులు



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 416 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ఇందులో బ్యాంక్ కెనాల్‌కు 50 క్యూసెక్కులు, తూర్పు కెనాల్‌కు 258 క్యూసెక్కులు,, నిజాంపట్నం కాలువకు 110 క్యూసెక్కులు, కొమ్మమూరు కాల్వకు 100 క్యూసెక్కులు నీటిని విడుదల చేశారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 526.60 అడుగుల వద్ద ఉంది. ఇది 161.5866 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎడమ కాలువకు 4,707, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 3,533,ఎస్ఎల్‌బీసీకి 1,772, వరద కాలువకి 225 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 10,746 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 4,128 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 804.80 అడుగుల వద్ద ఉంది. ఇది 31.4403 టీఎంసీలకు సమానం.



చిలకలూరిపేటలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి విడదల రజిని



సత్తెనపల్లి తాలూకా సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

స్ఫూర్తి మూర్తికి సలాం

చిలకలూరిపేట: సమసమాజ స్థాపనే అంబేడ్కర్ లక్ష్యమని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలోని ఎన్ఆర్‌టీ సెంటర్‌తో పాటు పలు ప్రాంతాల్లో ఉన్న అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో అంబేడ్కర్ స్ఫూర్తితో ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన కొనసాగిస్తున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్ర ప్రసాద్, మాజీ చైర్మన్ మద్దిరాల విశ్వనాథం, పార్టీ ఎస్సీ విభాగం నాయకులు బండారు వీరయ్య, బండారు దాసు, ఎస్.వెంకయ్య, వడితే కోట్యానాయక్ పాల్గొన్నారు.

సామాజిక మార్పుకు పునాది వేసిన అంబేడ్కర్

సత్తెనపల్లి: న్యాయవాదిగా, ఆర్థిక వేత్తగా, రాజకీయ వేత్తగా, రాజ్యాంగ నిర్మాతగా అన్నిటికి మించి సామాజిక సంస్కర్తగా ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని, సామాజిక మార్పునకు పునాది వేసిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని వైఎస్ఆర్ సీపీ నియోజకవర్గ కార్యాలయం, పట్టణంలోని తాలూకా సెంటర్, ఏరియా వైద్యశాలలో బాబా సాహెబ్ 132వ జయంతి వేడుకల్లో శుక్రవారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ముందుగా వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి, అనంతరం తాలూకా సెంటర్లోని అంబేడ్కర్ విగ్రహానికి, ఏరియా వైద్యశాలలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయా సందర్భాల్లో మంత్రి అంబటి మాట్లాడుతూ అంటరానితనంపై అలుపెరగని పోరు చేశారన్నారు. కార్యక్రమంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, వైస్ చైర్మన్‌లు షేక్ నాగూర్ మీరాన్, కోటేశ్వరావు నాయక్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబురావు, పల్నాడు జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు, కౌన్సిలర్ అచ్యుత శివప్రసాద్, పల్నాడు జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు యాసారపు బాబు, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కోడిరెక్క దేవదాసు, నాయకులు సదనం హరి, షేక్ జానీ, సందెపోగు గాంధీ, షేక్ మౌలాలి, వెలుగూరి శరత్, రామారావు, కౌన్సిలర్లు, పలువురు ప్రజా ప్రతినిధులు, దళిత సంఘాల నాయకులు ఉన్నారు.



నరసరావుపేటలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పించిన కలెక్టర్ శివశంకర్, జేసీ

ఆదర్శమూర్తి డాక్టర్ అంబేడ్కర్

నరసరావుపేట: నేటి యువతకు ఆదర్శమూర్తి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, భారతరత్న, రాజ్యాంగ సృష్టికర్త డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ 132వ జయంతి సందర్భంగా శుక్రవారం జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాదుతో కలసి పల్నాడు జిల్లా కేంద్రంలోని క్లాక్ టవర్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పౌడా చైర్మన్ మిట్టపల్లి రమేష్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.సుజాతాపాల్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన
ఐజీ పాలరాజ్

- మహిళల సమస్యలపై ప్రత్యేక దృష్టి
- రేంజ్‌లో మంచి పోలీసింగ్‌ను నిర్వహిస్తాం
- సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తాం
- విలేకరుల సమావేశంలో వెల్లడి



నగరంపాలెం: గుంటూరు రేంజ్ ఐజీగా జి. పాలరాజ్ బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు నగరం కలెక్టర్ బంగ్లా రోడ్‌లోని ఐజీ కార్యాలయంలో శుక్రవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈనెల 8న రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ఐపీఎస్‌ల బదిలీల్లో ఏలూరు రేంజ్ ఐజీగా విధులు నిర్వహిస్తున్న పాలరాజ్‌ను గుంటూరు రేంజ్ ఐజీగా బదిలీ చేసిన విషయం విదితమే. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. తనపై నమ్మకంతో ఐజీ బాధ్యతలు అప్పగించిన సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి, డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. గతంలో పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా విజిలెన్స్‌లో, డీజీపీ ప్రధాన కార్యాలయంలో టెక్నికల్ సరీ్వసెస్, దిశలో విధులు నిర్వర్తించినట్లు తెలిపారు. గుంటూరు రేంజ్‌పై పూర్తిగా అవగాహన ఉందన్నారు. శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా అన్ని విధాలుగా చర్యలు చేపడతామని చెప్పారు. అదే విధంగా మహిళలపై నేరాలు జరగకుండా నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు.

2021 నరసరావుపేటలో డిగ్రీ విద్యార్థిని అనూష హత్య కేసులో సహ విద్యార్థికి జీవితఖైదు, బీటెక్ విద్యార్థినీ రమ్య హత్య కేసులో నిందితుడికి ఉరి శిక్ష విధించారని ఐజీ గుర్తుచేశారు. రాష్ట్రంలోని పలువురు పోలీస్ ఉన్నతాధికారులకు ముఖ్యమైన కేసులను అప్పగించారని అన్నారు. అందులో రాష్ట్ర వ్యాప్తంగా 120 కేసులను అప్పగించగా, 68 కేసుల్లో నిందితులకు శిక్షలు పడినట్లు చెప్పారు. పలు కేసుల్లో నిందితులకు శిక్షలు విధించడం వల్ల సమాజంలో మార్పు తథ్యమని అన్నారు. గ్రామాల్లోని మహిళలకు నేరాలపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. అదే విధంగా గ్రామాల్లో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికై ప్రత్యేక కృషి చేస్తామన్నారు. నేరాలకు పాల్పడే వారికి శిక్షలు పడే విధంగా పోలీస్ పనిచేస్తుందని చెప్పారు. రేంజ్ పరిధిలో మంచి పోలీసింగ్‌ను నిర్వహించి, సత్ఫలితాలు సాధిస్తామన్నారు. సైబర్ నేరాలపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తామని, నేరం జరిగిన వెంటనే సమగ్రంగా వివరాలు తెలుసుకున్నట్లయితే 90 శాతం నేరాలు చేధించవచ్చునన్నారు.

సైబర్ క్రైం టోల్‌ఫ్రీం నంబర్‌పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించనున్నామని పేర్కొన్నారు. నేరాలు వాటిల్లకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటామని వివరించారు. ఉన్నతంగా చదువుకున్న కొందరు బయటకొచ్చి సైబర్ నేరగాళ్లగా అవతారం ఎత్తుతున్నారని చెప్పారు. పలురకాల లింక్‌లతో డబ్బులు గుంజేసుకుంటున్నారన్నారు. అర్బన్ పరిధిలోనే 70 శాతం మంది సైబర్ నేరాల బారినపడుతున్నారని, వీటిన్నింటిపై రానున్న రోజుల్లో చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఐజీగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఐజీని పల్నాడు జిల్లా ఎస్పీ వై.రవిశంకరరెడ్డి, బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, ప్రకాశం జిల్లా ఎస్పీ మల్లికాఖర్గే, గుంటూరు ఏఎస్పీలు అనీల్‌కుమార్ (ఎల్‌అండ్‌ఓ), ఎ.శ్రీనివాసరావు (క్రైం), కె.కోటేశ్వరరావు (ఏఆర్), రేంజ్ పరిధిలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛాలు అందించారు.

వేటకు లంగరు!

- రెండున్నర నెలల పాటు సముద్రంలో వేట నిషేధం
- ఆదుకోనున్న మత్స్యకార భరోసా

చీరాల టౌన్: రెండున్నర నెలల పాటు సముద్ర తీర ప్రాంతాల్లో హైలెస్సా.. హైలెస్సా అనే మాటలు వినపడవు. తీరం ఒడ్డున మత్స్యకారుల సందడి కనిపించదు. సముద్రంలో మత్స్యకారుల బోట్లు కనిపించవు. సముద్రం బోసిగా దర్శనమివ్వబోతోంది. ప్రభుత్వం వేటపై నిషేధాజ్ఞలు జారీ చేసింది. కానీ వేట తప్ప మరో పని తెలియని మత్స్యకారుల పరిస్థితి ఈ సంధికాలంలో సుడిగండంలో ఉన్న మత్స్యకారులకు అండగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిలవనున్నారు.

మే 15 కల్లా గంగపుత్రులకు మత్స్యకార భరోసా కింద ఒక్కో మత్స్యకార కుటుంబానికి ఆర్థిక తోడ్పాటు అందించేలా రూ.10 వేలు ఇవ్వనున్నారు. ఈనెల 15 నుంచి జూన్ 15 తేదీ వరకు సముద్రంలో చేపల వేట నిలుపుదల చేస్తున్నట్లు మత్స్యశాఖ అధికారులు ప్రకటించారు. ప్రతిఏటా ఈ సమయంలో చేపలు పునరుత్పత్తి సమయం సందర్భంగా సముద్రంలో మరబోట్లు, యాంత్రీకరణ తెప్పలకు నిషేధ సమయంలో పూర్తిగా వేటను నిలుపుదల చేయాలని ఆదేశాలిచ్చారు. నిషేధ సమయంలో మత్స్యకారులకు వైఎస్సార్ సీపీ సర్కారు ఒక్కో కుటుంబానికి ఆర్థిక సాయం అందించనుంది. బాపట్ల జిల్లా పరిధిలోని ఆరు నియోజకవర్గాలు ఉండగా రేపల్లె, బాపట్ల, చీరాల, పర్చూరు నియోజకవర్గాల్లోని ఏడు మండలాల్లో 9600 మత్స్యకార కుటుంబాలు ఉన్నాయి.



వాడరేవు తీరం ఒడ్డున నిలిపిన వలలు, పడవలు

బాపట్ల జిల్లాలో 50 వేల మత్స్యకారులు ఉండగా 25000 మంది మత్స్యకారులు వేటపై ఆధార పడి జీవనం సాగిస్తున్నారు. ఒక్కో బోటుకు ఆరుగురు మత్స్యకారులు ఉంటారు. బాపట్ల జిల్లాలో ఉన్న ఏడు తీరప్రాంత మండలాల్లో 76 కిలో మీటర్లు ఉన్న సముద్రతీర ప్రాంతంలో 50,000 మంది మత్స్యకార జనాభా, 9600 మత్స్యకార కుటుంబాలు ఉన్నాయి. జిల్లాలో మోటారు, మెకనైజ్డ్ బోట్లు 2924 పైచిలుకు బోట్లు ఉన్నాయి. జిల్లాలోని రేపల్లె, నిజాంపట్నం, బాపట్ల, చీరాల, వేటపాలెం, చినగంజాం మండలాల్లో సముద్ర తీరప్రాంతం ఉంది. సముద్రతీర ప్రాంతం జిల్లాలోని రేపల్లెలోని లంకెనవాలిపల్లి దిబ్బ నుంచి చినగంజాం మండలం ఏటిమొగ వరకు తీరప్రాంతం విస్తరించి ఉంది. ఈ మండలాల్లోని మత్స్యకారులు సముద్రంలో వేట చేసి మత్స సంపదను విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. జూన్ 14 వరకు సముద్రంలో వేట నిషేధం విధించడంతో మత్స్యకారుల వేట సామగ్రిని, బోట్లను ఒడ్డుకు తీసుకువచ్చి నిలుపుదల చేశారు.

కుటుంబ పోషణకు అండగా మత్స్యకార భరోసా..

సాధారణంగా వాడరేవు మత్స్యకారులు కృష్ణా జిల్లా మచిలీపట్నం, నెల్లూరు జిల్లా రామాయపట్నం వరకు వేటకు వెళ్లి గురకా, పాములు, బొంత, కూనాము, వంజరం, పండుగప్పలు లాంటి చేపలను పట్టుకొస్తుంటారు. నిషేధ కాలం రెండున్నర నెలలు ఉండటంతో మత్స్యకారులు ఇబ్బందులు ఇబ్బందులకు తొలగించేందుకు ప్రభుత్వం మత్స్యకార భరోసా అందిస్తూ అండగా నిలుస్తోంది.

బోట్లతో వేట సాగిస్తే చర్యలు



సముద్రంలో చేపల సంతానోత్పత్తి పెరిగే కారణంగా శనివారం నుంచి జూన్ 14 వరకు వేట నిషేధం అమలు చేస్తున్నాం. సంప్రదాయ తెప్పలు వేట సాగించుకోవచ్చనని, మెకనైజ్డ్ ఇంజిన్ బోట్లతో సముద్రంలో వేట సాగిస్తే చర్యలు తీసుకుంటాం. మత్స్యకారులు కేంద్రం ప్రభుత్వ ఆదేశాలు విధిగా పాటించాలి. మత్స్యకార భరోసా కింద బోట్లు పరిశీలన చేసి దరఖాస్తులను ఆన్‌లైన్ నిక్షిప్తం చేస్తాం. విచారణ చేసి మే 1న భరోసా తుది జాబితా ప్రకటిస్తాం. మేలో సీఎం జగన్ మత్స్యకారులకు భరోసా సాయాన్ని వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నారు.

– ఎ.సురేష్, మత్స్యశాఖ జిల్లా అధికారి, బాపట్ల

ఇంత 'కన్నా' దారుణం ఉంటుందా?

- అంబేడ్కర్ జయంతి వేడుకల్లో టీడీపీ నేత దౌర్జన్యం
- గుంటూరులో హడావుడి

నెహ్రూనగర్ (గుంటూరు తూర్పు): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకల్లో టీడీపీ నాయకుడు కన్నా లక్ష్మీనారాయణ అత్యుత్సాహం ప్రదర్శించారు. లాడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహాన్ని ఆధునీకరించి దానికి అంబేడ్కర్ సర్కిల్‌గా నామకరణం చేసి ప్రారంభించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని కుల, దళిత సంఘాల నాయకులతో, అన్ని పార్టీ నాయకులను కలుపుకుంటూ శుక్రవారం ఉదయం 9 గంటలకు అధికారికంగా షెడ్యూల్ ప్రకటించారు. దీనికి సంబంధించి గురువారం సాయంత్రమే సమాచారం అందరికీ చేరవేసింది. అయితే టీడీపీ నాయకులు కన్నా లక్ష్మీనారాయణ నిర్ణయించిన షెడ్యూల్ కన్నా ముందే వచ్చి ప్రొటోకాల్‌ను కాదని అంబేడ్కర్ విగ్రహానికి దండ వేస్తానని, తన అనుచరులతో కలిసి విగ్రహం వద్ద దౌర్జనం చేయసాగారు. దీన్ని ఖండిస్తూ దళిత కార్పొరేటర్ బోడపాటి ఉషారాణి భర్త వైఎస్సార్‌సీపీ నాయకులు బోడపాటి కిషోర్ జిల్లా కలెక్టర్ వేణుగోపాల రెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జునలు ఉదయం 9 గంటలకు అధికారికంగా వచ్చి అంబేడ్కర్ సర్కిల్‌గా నామకరణం చేసి ప్రారంభిస్తారని, ఆ తరువాత దండ వేయాలని సూచించినప్పటికీ దౌర్జన్యంగా తోసుకుంటూ వెళ్లడంతో పాటు దూషిస్తూ, దాడి చేయడానికి యత్నించి భయభ్రాంతులకు గురిచేసి మరి అంబేడ్కర్ విగ్రహానికి దండ వేశారు. మాజీ మంత్రిగా పనిచేసిన అనుభవం ఉన్న వ్యక్తి అయి ఉండి కన్నా లక్ష్మీనారాయణ ప్రోటోకాల్ పాటించకుండా దళిత నాయకుడిని తోసేసి, దాడి చేసేందుకు ప్రయత్నించడాన్ని ఖండిస్తూ స్థానిక అరండల్‌పేటలో పోలీస్ స్టేషన్‌లో దళిత, గిరిజన కార్పొరేటర్లు కన్నాపై ఫిర్యాదు చేశారు.



కిషోర్‌ను తోసేస్తూ ముందుకు వెళ్తున్న కన్నా, అనుచరులు

దళిత కార్పొరేటర్ భర్తకు క్షమాపణ చెప్పాలి

దళిత కార్పొరేటర్ బోడపాటి ఉషారాణి భర్త కిషోర్‌పై టీడీపీ నాయకులు కన్నా లక్ష్మీనారాయణ విచక్షణ కోల్పోయి దౌర్జన్యంగా వ్యవహరిస్తూ, తన అనుచరులతో అతనిపై దాడికి యత్నించి అంబేడ్కర్ విగ్రహానికి దండ వేయడం చాలా బాధాకరమైన విషయమని నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు పేర్కొన్నారు. మాజీ మంత్రిగా సేవలందించిన కన్నా ప్రొటోకాల్ పాటించకుండా దౌర్జన్యంగా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు.

లాడ్జ్ సెంటర్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహాన్ని చుట్టూ ఆధునీకరించి దానికి అంబేడ్కర్ సర్కిల్‌గా నామకరణం చేసేందుకు అధికార ప్రకటన చేయడం జరిగిందన్నారు. 9 గంటలకు అధికారికంగా ప్రొటోకాల్ ప్రకారం జిల్లా కలెక్టర్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున, ఇతర జిల్లా అధికారులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు ప్రారంభిస్తారని బోడపాటి కిషోర్ చెబుతున్నప్పటికీ వినకుండా, ఆయన్ను తోసేసి, దాడి చేసే ప్రయత్నం చేసి అంబేడ్కర్ విగ్రహానికి దండ వేసినంత మాత్రాన అంబేడ్కర్‌కు నిజమైన నివాళులర్పించడం కాదన్నారు. లక్ష్మీనారాయణ దళిత నాయకుడు బోడపాటి కిషోర్‌కు బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు.

ఆరోగ్యం ఎలా ఉంది?

ముమ్మరంగా ఫీవర్ సర్వే

- జిల్లా వ్యాప్తంగా 93 శాతం సర్వే పూర్తి
- కోవిడ్ కేసులు పెరుగుతున్న దృష్ట్యా వైద్యశాఖ అప్రమత్తం
- కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు

గుంటూరు మెడికల్: కొద్దిరోజులుగా దేశంలోని పలు రాష్ట్రాల్లో కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య ఎక్కువగా నమోదవుతున్న దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. నూతనంగా విధుల్లో చేరిన వైద్యులు, వైద్య సిబ్బందికి సైతం కరోనా పాజిటివ్ నిర్ధారణ పరీక్షలు ఏవిధంగా చేయాలి, శాంపిల్ ఏవిధంగా సేకరించాలి, బాధితులకు ఏవిధంగా చికిత్స అందించాలనే విషయాలపై పూర్తి స్థాయిలో శిక్షణా తరగతులు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా వైద్య సిబ్బంది ఇంటింటికి తిరిగి ఫీవర్ సర్వే చేస్తున్నారు. జ్వరం, దగ్గు, జలుబు వంటి వాటిపై ఆరాతీస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న 49వ ఫీవర్ సర్వేలో ఎవరికైనా కరోనా పాజిటివ్ రిపోర్ట్ వస్తే తక్షణమే వారికి హోమ్ ఐసోలేషన్ కిట్స్ అందజేసి ఇంట్లోనే చికిత్స అందించే ఏర్పాట్లు చేస్తున్నారు.

93 శాతం సర్వే పూర్తి

జిల్లా వ్యాప్తంగా 7,16,253 ఇళ్లు ఉన్నాయి. వలంటీర్, ఆశ, ఏఎన్ఎం వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి ఫీవర్ సర్వే చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 6,54,209 ఇళ్లు ఫీవర్ సర్వే పూర్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా 93 శాతం సర్వే పూర్తవడంతో వీరిలో 897 మందికి జ్వరపీడిత లక్షణాలు ఉన్నట్లు వైద్య సిబ్బంది గుర్తించారు. వారికి కోవిడ్ సోకిందా, సాధారణ జ్వరమా అనే అనుమానాలు నివృత్తి చేసి ఇళ్ల వద్ద, సమీపంలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో, ఆరోగ్య కేంద్రాల్లో యాంటిజన్ టెస్టులు చేస్తున్నారు. యాంటిజన్ టెస్ట్‌ల్లో కోవిడ్ పాజిటివ్ వస్తే ఖచ్చితమైన నిర్ధారణ కోసం ఆర్టీపీసీఆర్ పరీక్ష చేసి నిర్ధారిస్తున్నారు. గుంటూరు వైద్య కళాశాలలో ఆర్టీపీసీఆర్ టెస్టులు, హోల్ జీనోమ్ సీక్వెన్సింగ్ టెస్టులు అందుబాటులో ఉన్నాయి.



పరిమి గ్రామంలో కోవిడ్ పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

కొద్దిపాటి జాగ్రత్తలు పాటించాలి

కొద్దిరోజులుగా దేశంలోని పలు రాష్ట్రాల్లో కోవిడ్ పాజిటివ్ కేసులు ఎక్కువగా ఉన్న దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగం ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ఇంటింటికీ వైద్య సిబ్బంది వెళ్లి ఫీవర్ సర్వే చేస్తున్నారు.

జ్వరం, దగ్గు, జలుబు గొంతునొప్పి, తలనొప్పి వంటి లక్షణాలు ఉన్నవారని ఫీవర్ సర్వేలో గుర్తిస్తే తక్షణమే వారికి ఇంటివద్దే చికిత్స పొందేలా హోం ఐసోలేషన్ మెడికల్ కిట్స్ అందిస్తున్నారు. హోం ఐసోలేషన్‌లో ఉన్నవారి ఆరోగ్య పరిస్థితిపై ప్రతి రోజూ వైద్యులు, వైద్య సిబ్బంది ఆరా తీస్తున్నారు. ఇళ్ల వద్ద చికిత్స పొందేందుకు ఏమైనా సందేహాలు, అనుమానాలు ఉన్నవారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నాం. ఏమైనా క్రిటికల్ కేసులు కనిపిస్తే వాటికి చికిత్స అందించేందుకు గుంటూరు జీజీహెచ్‌తోపాటుగా పలు ఆసుపత్రుల్లో కోవిడ్ మాక్ డ్రిల్ నిర్వహించి వెంటిలేటర్లు, మందులు, ఆక్సిజన్ సరఫరా, ప్రత్యేక ఐసీయూ, అన్ని సిద్ధం చేసి ఉంచాం.

– డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు, డీఎంహెచ్‌ఓ

ప్రజాస్వామ్యదేశంగా తీర్చిదిద్దిన డాక్టర్ అంబేడ్కర్

జిల్లా పోలీసు కార్యాలయంలో నివాళులర్పించిన ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

నరసరావుపేట: భారత రాజ్యాంగాన్ని ప్రపంచంలోనే అత్యుత్తమ రాజ్యాంగంగా తీర్చిదిద్ది అత్యున్నత ప్రజాస్వామ్య దేశంగా అవతరించడంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశేష కృషి చేశారని జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి కొనియాడారు. స్వాతంత్ర్య సమరయోధుడు, భారత రాజ్యాంగ రూపశిల్పి, సామాజిక సంస్కర్త, అణగారిన వర్గాల ఆశాజ్యోతి, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 132 జయంతి సందర్భంగా శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ సమాజంలో అస్పృశ్యత నివారణ కోసం, అణగారిన వర్గాల అభ్యున్నతికి కోసం అలుపెరుగని యోధుడిలా శ్రమించి భావితరాలకు బాటలు వేశాడన్నారు.


అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

అనంతరం పట్టణంలోని గడియారం స్తంభం కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి పోలీస్ అధికారులు, పుర ప్రముఖులతో కలసి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ(ఏఆర్) రాజు, డీఎస్పీ సి.విజయభాస్కర్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమానత్వ సాధకుడే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

ఎంపీ లావు, ఎమ్మెల్యే కాసు

పిడుగురాళ్ల: సమానత్వ సాధకుడే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయులు, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఐలాండ్ సెంటర్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. అంబేడ్కర్ విగ్రహం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయులు, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. తొలుత పట్టణ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో ఆర్అండ్‌బీ బంగ్లా నుంచి ఐలాండ్ సెంటర్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయులు, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిలు ప్రారంభించారు. ఎంపీ లావు, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ కమిటీ సభ్యులంతా 30 సంవత్సరాల్లో చేయలేనిది 30 రోజుల్లో చేసి అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రారంభం చేయటం జరిగిందన్నారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కౌన్సిలర్ జడ సురేంద్ర అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, ఎస్సీ సెల్ అధ్యక్షులు కాలే మాణిక్యరావు, పట్టణ, మండల కన్వీనర్లు చింతా వెంకటరామారావు,


డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ లావు, ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి

చల్లా పిచ్చిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి, సీనియర్ నాయకులు భవనాశి యల్లారావు, కుందుర్తి గురవాచారి, చందవరకు రాంబాబు, మల్లెల వెంకట్రావు, దారా చెన్నయ్య, పిల్లి ప్రేమానందం, బాలస్వామి, మాజీ జెడ్పీటీసీ వీరభద్రుని రామిరెడ్డి, నేలటూరి సుధాకర్, డాక్టర్ ఉన్నం నాగమల్లికార్జునరావు, కత్తెరపు రామ్‌గోపాల్‌రెడ్డి, నేలటూరి బాలరాజు, రత్నం మాస్టర్, మున్సిపల్ కౌన్సిలర్లు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ప్రభుత్వ వైద్యం

- కరోనాలో ప్రాణాలు తెగించి వైద్య సేవలు అందించిన వైద్యులు
- సంతృప్తికరంగా ప్రాణాలు నిలబెట్టే సాయం
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు.
- ఏరియా వైద్యశాలలో ఆక్సిజన్ ప్లాంట్, జనరేటర్, ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభోత్సవం


మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు, పక్కన ఎంపీ శ్రీకృష్ణదేవరాయులు, కలెక్టర్ లోతేటి శివశంకర్, డీసీహెచ్ డాక్టర్ రంగారావు తదితరులు

సత్తెనపల్లి: ప్రాణమే ముఖ్య మనుకున్న రోజుల్లో ప్రాణాలకు తెగించి ప్రభుత్వ వైద్యులు కరోనా రోగులకు సేవలందించారని, పేదలకు ప్రభుత్వ వైద్యాన్ని అండగా నిలిపిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని రాష్ట్ర జలవనుల శాఖ మంత్రి అంబటి రాంబాబు స్పష్టం చేశారు. పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.65 లక్షలతో 500 లీటర్ల సామర్థ్యం కలిగిన నూతన ప్రాణవాయు ఉత్పత్తి కేంద్రం (ఆక్సిజన్ ప్లాంట్), రూ.45 లక్షలతో 250 కేవీ సామర్థ్యం కలిగిన నూతన జనరేటర్, రూ.60 లక్షలతో 315 కేవీ సామర్థ్యం కలిగిన నూతన త్రీఫేస్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ల ప్రారంభోత్సవంలో శుక్రవారం నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు, పల్నాడు జిల్లా కలెక్టర్ లోతోటి శివశంకర్‌తో కలసి ఆయన హాజరయ్యారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యులు మానవతా దృక్పథంతో సేవలందించాలని సూచించారు. 100 పడకల వైద్యశాలగా పూర్తిస్థాయిలో ఏరియా వైద్యశాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. అభివృద్ధి కమిటీ సభ్యులైన కొత్త రామకృష్ణ, ఖాజా తదితర బృందం వైద్యశాలలో రూ.కోటి విలువైన వస్తువుల, సేవల రూపంలో సహకారం అందించారన్నారు. వారి సహకారం అభినందనీయమన్నారు. ప్రత్యేకించి కొత్త రామకృష్ణ సేవాభావాన్ని కొనియాడారు. నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. మెడికల్ కళాశాలలు నిర్మించడం, మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడం, సిబ్బందిని నియమించడం జరుగుతుందన్నారు. కలెక్టర్ లోతేటి శివశంకర్ మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ వైద్యంపై నమ్మకం కలిగేలా కృషి చేయాలని సూచించారు. ఉత్తమంగా సేవలందిస్తున్న సిబ్బందిని ప్రశంసించారు. ముందుగా జనరేటర్‌ను మంత్రి అంబటి రాంబాబు, ఆక్సిజన్ ప్లాంట్‌ను ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు, త్రీఫేస్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను కలెక్టర్ లోతేటి శివశంకర్‌లు ప్రారంభించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీసీహెచ్ డాక్టర్ రంగారావు, సత్తెనపల్లి ఆర్డీవో బీఎల్ఎన్ రాజకుమారి, ఏపీఎమ్ఎస్ ఐడీ ఈఈ శ్రీధర్, ఏపీఎం ఎస్ఐడీ డీఈ భాగ్యలక్ష్మి, ఏపీఎంఎస్ ఐడీ ఎలక్ట్రికల్ ఇంజినీర్ వెంకట్, ధనుంజయ్, ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ ఈటిపోగు వెంకట్రావు, టీబీ యూనిట్ సూపర్‌వైజర్ స్టాలిన్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబురావు, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ నాగూర్ మీరాన్, వ్యవసాయ సలహా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కళ్లం విజయభాస్కరరెడ్డి, వాణిజ్య విభాగం పల్నాడు జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు డాక్టర్ ఎస్.రాజమోహన్‌రెడ్డి, పార్టీ నాయకులు షేక్ మౌలాలి, షేక్ జానీ, ఎస్ఎం యూనస్, పెద్దింటి వెంకటేశ్వర్లు, వెలుగూరి శరత్, తోట కృష్ణ, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

డాక్టర్ అంబేడ్కర్ స్ఫూర్తితోనే నవోదయం

కలెక్టరేట్‌లో నివాళులర్పించిన జేసీ


అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న జేసీ శ్యామ్‌ప్రసాద్

నరసరావుపేట:రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో జగనన్న బడుగు వికాసంలో భాగంగా ఎస్సీ, ఎస్టీల సాధికారిత కోసం జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ప్రతినెలా నవోదయం నిర్వహిస్తున్నారని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. భారతరత్న అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీనుల సామాజిక, ఆర్థికాభివృద్ధి ద్వారానే దేశం అభివృద్ధి సాధిస్తుందని అంబేడ్కర్ నమ్మారన్నారు. పనిగంటలు రోజుకు ఎనిమిది గంటలని నిర్ణయించి కార్మిక చట్టాల్లో మార్పులకు శ్రీకారం చుట్టారన్నారు. అటువంటి మహోన్నత వ్యక్తిని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. డీఆర్వో కె.వినాయకం, డీఆర్‌డీఏ పీడీ బాలూనాయక్, డీడీ మహాలక్ష్మి, నవోదయం నోడల్ అధికారి సంజీవరావు, సూపరింటెండెంట్ అనీల్‌కుమార్ పాల్గొన్నారు.

నిప్పుల కొలిమిలా రెంటచింతల

రెంటచింతల: రెంటచింతల శుక్రవారం నిప్పుల కొలిమిలా మారింది. గరిష్ట ఉష్ణోగ్రత 44.6, కనిష్ట ఉష్ణోగ్రత 27.3 డిగ్రీలుగా నమోదైనట్లు వాతావరణ శాఖాధికారులు తెలిపారు. ఈ ఏడాది ఇక్కడ నమోదైన అత్యధిక ఉష్ణోగ్రత ఇది. గ్రామంలో రోజురోజుకూ పెరుగుతున్న ఎండలకు ఉదయం 10గంటల నుంచే వడగాడ్పులు వీస్తుండటంతోపాటు గ్రామస్తులు హడలిపోతున్నారు. వృద్ధులు, బాలింతలు, చిన్నారులు, గర్భిణులు అవస్థలకు గురవుతున్నారు.

అంబేడ్కర్ జీవితం యువతకు ఆదర్శనీయం

జీఎస్టీ కమిషనర్ రాజేశ్వరరావు

నాదెండ్ల: అట్టడుగు స్థాయి ఉన్నత స్థానానికి ఎదిగిన అంబేడ్కర్ జీవితం యువతకు ఆదర్శనీయమని గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ బహుజంకు రాజేశ్వరరావు తెలిపారు. గణపవరం మెయిన్ బజారులోని అంబేడ్కర్ విగ్రహానికి ఆయనతో పాటు మాజీ యార్డు డైరెక్టర్ దారా కొండయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కాటా ముసలయ్య తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో దాసరి నాగేశ్వరరావు, కొప్పుల ఓబయ్య, నావూరి రాజేష్, ప్రవీణ్, అక్కల అశోక్, గోపీ, పిచ్చియ్య, అంకయ్య నాని, ఓబులేసు, నంబూరు వసంతరావు పాల్గొన్నారు. కనపర్రు పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ పెరుమాళ్లపల్లి వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి కాంతారావు, ఇర్లపాడు గ్రామంలో సర్పంచ్ మంగు రమాదేవి, నాదెండ్ల అంబేడ్కర్ యూత్, భీమ్ ఆర్మీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.


అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ రాజేశ్వరరావు


భావితరాలకు దిక్సూచి బాబా సాహెబ్

యడ్లపాడు: భావితరాలకు బాబాసాహెబ్ అంబేడ్కర్ దిక్సూచి అని ఏపీఎస్‌పీ డీఐజీ బి. రాజకుమారి పేర్కొన్నారు. పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం కొత్తసొలసలో జై భీమ్ యూత్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహాన్ని శుక్రవారం ఆవిష్కరించారు.ముందుగా జై భీమ్ యూత్ సభ్యులు నీలిరంగు జెండాలతో యడ్లపాడు 16వ నంబర్ జాతీయ రహదారి నుంచి అతిథులతో కలసి కొత్తసొలస వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని ఆర్‌సీఎం చర్చి సమీపంలో ఆర్ అండ్ బీ రోడ్డు పక్కనే నూతనంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని రాజకుమారి, సెబ్ సీఐ బాలయ్య దంపతులు, జై భీమ్ కమిటీ, ఇతర అతిథులతో కలసి ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రాజకుమారి మాట్లాడారు. పండితులకే పండితుడు, మహోపాధ్యాయులకే మహోపాధ్యాయుడు, చరిత్రకారుడు, విజ్ఞానం, పరిజ్ఞానం కలిగిన మేధావి, సామాజిక, ఆర్థిక, తత్త్వవేత్త, భారతరత్న, భారత రాజ్యాంగ నిర్మాత వంటి అనేక బిరుదులు కలిగిన మహోన్నత వ్యక్తి అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం తనకు లభించిన పూర్వజన్మ సుకృతం..అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. ప్రతి పల్లెలో కనిపించే అంబేడ్కర్ విగ్రహం తమ భవిష్యత్తును నిత్యం కొత్తమార్గంలో తీర్చిదిద్దుకోవాలని సూచిస్తుందని, చూపుడు వేలు చూపించడంలో ఉన్న అంతర్యాన్ని యువత గ్రహించాలని ఆమె తెలిపారు. అంబేడ్కర్ జయంతి నాడు ఇంతటి గొప్పకార్యాన్ని తలపెట్టిన జైభీమ్ సభ్యులకు ఆమె అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ దాసరి బాలయ్య, భట్టిప్రోలు ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ అధినేత యడ్ల సునీల్, జై భీమ్ రాష్ట్ర కార్యదర్శి పిల్లి రాజు, కాకుమాను జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శీలం రవిబాబు, సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబూరావు, రాష్ట్ర మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు అన్నవరపు కిశోర్, గోళ్ల అరుణ్‌కుమార్, ఉపాధ్యక్షుడు కొప్పుల జ్యోతిరత్నబాబు తదితరులు ప్రసంగించారు. కార్యక్రమాన్ని కొత్తసొలస జై భీమ్ సభ్యులు తాడిగిరి కిశోర్, నాగార్జున, బెజ్జం నరేంద్ర, యామర్తి రామాంజనేయులు, నల్లయ్య, బి. బాలస్వామి పర్యవేక్షించారు.


కొత్తసొలసలో అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరిస్తున్న రాజకుమారి

దళిత సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

చిలకలూరిపేటటౌన్: భారతరత్న, రాజ్యాంగ నిర్మాణ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు చిలకలూరిపేట నియోజకవర్గంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ నివాసంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు జరిగాయి. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గేరా లింకన్, సాతులూరి కోటి, రావూరి దాసు, గోపతోటి జాన్, చుక్కా డేవిడ్, రాజేష్ పాల్గొన్నారు. దళిత సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కేబీరోడ్డు, గాంధీపార్కు, ఎన్ఆర్‌టీ సెంటర్లోని అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పించారు. బాపట్ల ఎంపీ నందిగం సురేష్ పాల్గొని అంబేడ్కర్‌కు నివాళి అర్పించారు. జంగా ప్రసన్న, అన్నలదాసు బుల్లి, నల్లపు కోటి, యడ్ల సురేష్, వినీల్, చెల్లి రాంబాబు, కొప్పుల జ్యోతిరత్నబాబు, మైలా గణేష్, కొచ్చెర్ల కిషోర్ పేర్ల శరత్‌చంద్, దారా విక్రమ్, అద్దంకి బాబు, ప్రత్తిపాటి కోటి, బిరుదు కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.



27 ద్విచక్రవాహనాలు స్వాధీనం

అమరావతి: పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకరరెడ్డి ఆదేశాల మేరకు మండలంలో సమస్యాత్మక గ్రామాలలో విస్తృత తనిఖీలు నిర్వహించే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వేకువజామున మండల పరిధిలోని నరుకుళ్లపాడు గ్రామంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. సుమారు మూడు గంటలపాటు నిర్వహించిన ఈ కార్యక్రమంలో సత్తెనపల్లి డీఎస్పీ ఆదినారాయణ, సీఐ వీరాస్వామి, 11మంది ఎస్ఐలు మరో యాభైమంది సిబ్బందితో కలిసి నరుకుళ్లపాడు గ్రామాన్ని ఇంటింటికి వెళ్లి తనిఖీలు నిర్వహించారు. డీఎస్పీ ఆదినారాయణ మాట్లాడుతూ రికార్డులు, పత్రాలు సరిగా లేని 27ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని అమరావతి పోలీస్‌స్టేషన్‌కు తరలించామని తెలిపారు.


కార్డన్‌సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు